

ప్రాథమిక పాఠశాలల

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రాథమిక పాఠశాలలు అభివృద్ధి చెందడం ద్వారానే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ బలోపేతం అవుతుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో బదిలీల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ప్రాథమిక పాఠశాల వ్యవస్థను ఫౌండేషన్ పాఠశాల, బేసిక్ ప్రాథమిక పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేసిందని తెలిపారు. ఫౌండేషన్ పాఠశాలలో ఒకరకంగా, బేసిక్ ప్రాథమిక పాఠశాలలో వేరువేరుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను కేటాయింపు చేయడం సరికాదని అన్నారు. ఫౌండేషన్ పాఠశాలలో కూడా 1:20గా సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించాలని కోరారు. ఉన్నత పాఠశాలలో మిగులు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియంను అమలు చేయడం ద్వారా సర్దుబాటు చేయాలని కోరారు. అదనంగా ఉన్నత పాఠశాలలో డిసెండింగ్ ఆర్డర్ లోనైనా సబ్జెక్టు టీచర్‌ని ఎలాట్ చేయాలని కోరారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో సంబంధం లేకుండా ఐదు ఉపాధ్యాయులు, తరగతి గదులు, ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బదిలీల చట్టం రావడాన్ని యూటీఎఫ్ స్వాగతం చేస్తున్నామని, పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్స్ జరగడానికి అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్చడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. బదిలీలు, ప్రమోషన్లు, రేషనలైజేషన్ పారదర్శకంగా ప్రభుత్వం నిర్వహించేటట్లు యుటిఎఫ్ కృషి చేస్తుందని, ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరగకుండా పిల్లలకు నాణ్యమైన విద్య అందించే విధంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లలో రోజుకు రకమైన కసరత్తు ప్రభుత్వం చేస్తుందని, దీనివల్ల ఉపాధ్యాయుల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక నిర్దిష్టమైన ప్రతిపాదనని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల ముందు ప్రభుత్వం పెట్టి దాన్ని ఆమోదం తర్వాతే అమలు చేయడం కోసం ప్రయత్నం చేయాలని కోరారు. బదిలీలలో వస్తున్న మార్పులను కార్యకర్తలు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ఉపాధ్యాయులకు చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర నాయుడు, ఎన్.మణిగండన్, జిల్లా గౌరవాధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు కె.రెడ్డెప్ప నాయుడు, ఎస్.రెహానా బేగం, కోశాధికారి కె.ప్రసన్న కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్‌పి.బాషా, పిఆర్.మునిరత్నం, జిల్లా కార్యదర్శులు సీపీ ప్రకాష్, డి.ఏకాంబరం, బి.ఈశ్వర్ మహేంద్ర, కె.సరిత, పి.సురేష్, ఎం.పార్థసారథి, గణేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈ- కేవైసీ తో రేషన్‌కు గండం

రేషన్ కార్డుదారులంతా తప్పనిసరిగా ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కానీ ఈ కార్యక్రమం అనుకున్న స్థాయిలో జరగడం లేదు. గడువు ముగిస్తున్న ఇంకా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాల్సిన వారు వందల్లో మిగిలిపోయారు. ఈ ప్రక్రియ పూర్తికాని వారికి రేషన్ గండం పొంచి ఉంది. ఇందుకు డీలర్లు సైతం సహకరించడం లేదనే వార్తలు వినిపిస్తున్నాయి.

- అవగాహన లేమితో గ్రామీణ వాసులు దూరం
- సహకరించని డీలర్లు
- ఇబ్బంది పడుతున్న కార్డుదారులు



ఈ కేవైసీ చేయించుకుంటున్న ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లలు

ప్రజాశక్తి- పూతలపట్టు: గతంలో చిన్నపిల్లల తల్లిదండ్రుల వేలిముద్రలతో బియ్యం పొందుతున్న వారు.. ఇతరత్రా కారణాల చేత వేలిముద్రలు లేని వారు.. బియ్యం పొందాలంటే తప్పనిసరిగా ఈ కేవైసీ ఉండాలని నిబంధనలను ప్రభుత్వం జారీ చేసింది. ఈ పాస్ పరికరాల ద్వారా రేషన్ డీలర్లు ఎండియు వాహనాల వద్ద ఈ కేవైసీ నమోదుకు కార్డుదారులకు అవకాశం కల్పించారు. దీంతోపాటు ఆన్లైన్లోనూ ఇందుకు అవకాశం ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలకు దీనిపై అసలు అవగాహన లేదు. దీనికి తోడు మండలంలోని చాలా గ్రామాలకు ఇంటర్‌నెట్ సిగ్నలన్స్ అందవు, దీంతో వీరంతా డీలర్లు రేషన్ పైనే ఆధార పడాల్సి వస్తోంది. సమీపంలో ఉన్న డీలర్ల వద్దకు వెళ్లినా ఆ కేంద్రాలు మూసి ఉంటున్నాయి. రేషన్ బండ్లు వచ్చే సమయంలో కార్డుదారులంతా ఉపాధి హామీ ఇతర కూలి పనులకు బయటికి వెళ్లిపోతున్నారు. ఈ సమస్యలతో సకాలంలో వీరంతా ప్రక్రియ పూర్తి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. మండల మొత్తం మీద

> ఈ కేవైసీ చేసుకోవాల్సిన వారు: 37,708
> ఇప్పటివరకు పూర్తి చేసినవి : 35,247
> 0- 5 సంవత్సరాలలోపు వారు : 559
> 80 సంవత్సరాల పైబడిన వారు : 18
> (0–5 సంవత్సరాల వారు...
> 80 సంవత్సరాలు దాటిన వారికి
> ఈ కేవైసీ అవసరం లేదు).

అర్హుల్లో ఈ కేవైసీ నమోదు చేసుకోవాల్సిన వారు 37,708 మంది ఉన్నారు. నేటితో ప్రభుత్వం విధించిన గడువు పూర్తి కానుండడంతో మరింత గడువును పొడిగించాలని వీరంతా కోరుతున్నారు.

డీలర్ల సహకార లోపం..

డీలర్లు బియ్యం ఇచ్చే సమయంలో సంబంధిత కార్డులోని మిగిలిన సభ్యుల వేలిముద్రలు తీసుకోవాలని అధికారులు సమావేశాలు పెట్టి మరీ చెప్పారు. కానీ ఇక్కడ డీలర్ల సహకారం లోపించడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. బియ్యం వేసే సమయంలో కనీసం లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తే మరింత ప్రయోజకరంగా ఉండేది. ఎండియు వాహనదారులు సైతం వెళ్ళామా బియ్యం ఇచ్చామా అన్నట్టుగా ఉన్నారే.. తప్ప ప్రభుత్వ సూచనలను ఏమాత్రం పాటించడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం..

- మహేశ్వరి, ఇంచార్జ్ సిఎస్‌డిడిటి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేవైసీ కార్యక్రమాన్ని గడువులోపు పూర్తి చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాం. ఇప్పటికే 85 శాతం పూర్తిచేసాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పూర్తిస్థాయిలో సహకరిస్తే 100 శాతం పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రజలు కూడా సహకరించాలి.

102 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం

2న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కారం కోసం మే 2న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు తల్లీబిడ్డ సంరక్షణ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. మంగళవారం జరిగిన జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తల్లీబిడ్డ సంరక్షణ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్ల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అరబిందో ఏజెన్సీ డ్రైవర్ల సమస్యలు పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తల్లీబిడ్డ సంరక్షణ పేరుతో వాహనాలను ఏర్పాటు చేసి ఆస్పత్రులకు చేర్చే కార్యక్రమం చేస్తున్న వారి వాహనాల కండిషన్ బాగాలేక వాహన డ్రైవర్లకు తల్లీబిడ్డలకు సంరక్షణ లేకుండా చేసే పద్ధతిలో ఏజెన్సీ ఉందని అన్నారు. అలాంటి ఏజెన్సీ రద్దుచేసి ఉద్యోగులకు తల్లీబిడ్డల సంరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగుల నుంచి ఈఎస్ఐ, పిఎఫ్ డబ్బులు కట్ చేసి జమ చేయకుండా మోసం చేసిన సంస్థపై చర్యలు తీసుకోవాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వాహనాల కండిషన్ మెరుగుపరచాలన్న డిమాండ్ల సాధనకు మే 2వ తేదీన జరిగే కలెక్టరేట్ వద్ద ధర్నాను డ్రైవర్ల అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వారి సమస్యలు పరిష్కారం కోసం చేసే పోరాటాల్లో సిఐటియు ప్రత్యక్షంగా ఉంటూ అండగా నిలబడుతుందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులకు నెలనెలా జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో భవిష్యత్తులో ఉధృతమైన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు

తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

- 2025-26 సంవత్సరపు జిల్లా ప్రజా పరిషత్ ప్రతిపాదించిన బడ్జెట్‌కు ఆమోదం
- నరేగా నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

10వ తరగతి పరీక్షా ఫలితాలు తగ్గిన పాఠశాలలలో ప్రత్యేక శ్రద్ధతో ఉత్తీర్ణతా శాతం పెంచటంతో పాటు మెరుగైన విద్యా బోధన చేసేలా ప్రణాళికలు రూపొందించాలని జెడ్‌పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జెడ్‌పి సమావేశపు మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్‌పి చైర్మన్ ఆధ్యక్షతన వహించగా ప్రభుత్వ విప్, జి.డి.నెల్లూరు ఎమ్మెల్యే విఎం.థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎంఎల్‌ఏ కె.మురళిమోహన్, జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశపు అజెండా అంశాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులతో జిల్లాలో వేసవి కాలంలో ఎక్కడ తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధుల కొరత లేదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తీర్ణతలో వెనుకబడిన పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలన్నారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఉన్న ఎంఆర్ఐ, సిటి స్కాన్ వసతులను వినియోగించి అత్యవసర పరిస్థితులలో క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవ సమయంలో చిన్నచిన్న కారణాల రీత్యా గర్భవతులను ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని, సాధ్యమైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. గంగాధర నెల్లూరు నియోజక వర్గంలోని పిహెచ్‌సిలను పేదప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని, పాలసముద్రం మండలానికి సంబంధించి గంగమాంబపురంలో పిహెచ్‌సి నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయగా ప్రజలకు అనుగుణంగా ఉండేలా పిహెచ్‌సి నిర్మాణాన్ని తిరుమల రాజపురంలో ఏర్పాటు చేయాలని కోరారు. వితంతు పెన్షన్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో భాగంగా జిల్లాలోని 12 ప్రభుత్వ శాఖలలో చేపట్టిన కార్యక్రమాలు, ప్రగతిపై సమీక్షించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ, నరేగా పనులను పూర్తిస్థాయిలో చేపట్టాలని, తాగునీటి ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. వ్యవసాయ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు రుసుం చెల్లించిన రైతుల పొలాల్లో ట్రాన్స్ఫార్మర్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నరేగా నిధులతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో వంద శాతం సోలరైజేషన్‌లో భాగంగా వెండర్లను గుర్తించి మే 1 నుండి పనులు ప్రారంభించుటకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయిల్ ఫామ్‌ల ద్వారా 4 ఏళ్ల కాలంలో చెరకు పంట కంటే 4 రెట్లు అధిక ఆదాయం పొందవచ్చుని, ఆయిల్ ఫామ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాలను మండలస్థాయిలో అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు తెలియపరచాలన్నారు. ఉద్యాన పంటల అభివృద్ధిలో భాగంగా పనస పండు పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, వైద్యసేవలు, మందుల పంపిణీ, వైద్యపరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే కొంత మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వంకు నివేదించామన్నారు. జడ్పీపీ కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాఠశాలలలో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనుల్లో అసంపూర్ణంగా ఉన్న పనులను పూర్తి చేసి వాడుకలోనికి తీసుకొని రావాలని కోరారు. ఈ అంశంపై స్పందించిన జిల్లా కలెక్టర్ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు చేపట్టిన పనులను పూర్తి చేయడంలో కొంతవరకు నిధులు మంజూరు చేయడం జరుగుతున్నదని, ఉపాధి హామీ నిధులతో కాంపౌండ్ వాల్ ప్లేగ్రౌండ్ తదితర పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ ఫలితాలలో జిల్లా వెనుకబడి ఉన్నదని విద్యా ప్రమాణాల పెంపుపై విద్యాశాఖ అధికారులు శ్రద్ధ చూపాలని రామకుప్పం జడ్పిటిసి తెలుపగా జిల్లా విద్యా శాఖ అధికారి వరలక్ష్మి వివరిస్తూ పదవ తరగతిలో వెనుకబడిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి వెనకబడిన విద్యార్థుల విద్యాభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. కుప్పంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం విచ్చలవిడిగా ఫీజులను వసూలు చేస్తున్నారని, ఫీజుల చెల్లింపుకు సంబంధించిన బోర్డులను డిస్ప్లే చేసేలా చర్యలు చేపట్టాలని, కుప్పంలో ఎక్కువ మంది ఆర్ఎంపీ డాక్టర్లు వైద్యం చేయడం వల్ల క్యాన్సర్, కిడ్నీ బాధితులు ఎక్కువ అవుతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కుప్పం జడ్పిటిసి కోరారు. ఈ విషయంపై విద్య, వైద్యశాఖ అధికారులు పరిశీలిస్తామని వివరణ ఇచ్చారు. జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఆర్అండ్‌బి, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈలు సత్యనారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, ఇస్మాయిల్, సమగ్ర శిక్ష ఏపిసి వెంకట రమణ, డిఆర్‌డిఏ, ఐసిడిఎస్ పీడీలు శ్రీదేవి, వెంకటేశ్వరి, వ్యవసాయ, ఉద్యాన, ఏపీఎంఐపి, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీ కృష్ణ, మధుసూదన్ రెడ్డి, ఆరిఫ్, బాలసుబ్రమణ్యం, హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, డిపిఓ సుధాకర్ రావు, డిసిహెచ్ఎస్ పద్మాంజలి, జిల్లా సాంఘిక, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు చెన్నయ్య, చిన్నారెడ్డి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు జెడ్‌పిటిసి, ఎంపిటిలు, జిల్లా అధికారులు

'స్కిల్ యాప్' రైతుల చేతిలో డిజిటల్ శక్తి

రైతులకు టెక్నాలజీ పై అవగాహన అవసరం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

రైతులకు లాభసాటి వ్యవసాయం చేసేందుకు అవసరమైన డిజిటల్ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వడం ద్వారా మరింత ఎక్కువ పంట దిగుబడులు సాధించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఈ ఉద్దేశంతో స్కిల్ అప్ చిత్తూరు-డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమం కింద రైతుసేవా కేంద్రాలలో ఉన్న వ్యవసాయ సిబ్బందిలో 8 మందిని మాస్టర్ ట్రైనర్లుగా సిద్ధం చేసి వారి ద్వారా ఈ యాప్ వాడకంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇది రైతులకు ఎంతగానో ప్రయోజనం కలిగిస్తుంది.



- మారనున్న వ్యవసాయ విధానాలు



స్కిల్ ఆఫ్ చిత్తూర్ డిజిటల్ యాప్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్, స్మార్ట్ ఫోన్లతో శిక్షణ పొందిన రైతులు (ఫైల్ ఫొటోలు)

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై సాంకేతిక పరిజ్ఞానంను పెంపొందించే దిశగా స్మార్ట్‌ఫోన్ల ద్వారా వ్యవసాయ సంబంధిత అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచేందుకు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ 'స్కిల్ అప్ చిత్తూరు – డిజిటల్ ట్రైనింగ్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయ సాగు పద్ధతులు కూడా మారుతున్నాయి. విత్తనం నుండి విక్రయం దాక, వాతావరణం నుండి నేటి మార్కెట్ విక్రయ వివరాల దాక, ప్రతి విషయం ఇప్పుడు మన గుప్పెట్లో ఉన్నది. క్షేత్రస్థాయి వివరాలను రికార్డ్ చేయడానికి, పొలంలో వ్యవసాయ వనరులను వినియోగించుకోవడానికి, రైతుల ఫోన్‌లో అందుబాటులో ఉండే వివిధ రకాల యాప్‌ల వినియోగంతో తమ వ్యవసాయ ఉత్పత్తులను ఎటువంటి దళారి వ్యవస్థ లేకుండా నేరుగా కొనుగోలు దారులకు అమ్మవచ్చు. వీటన్నింటికీ స్మార్ట్ ఫోన్ వాడకం ద్వారానే చేయవచ్చు.

జిల్లాలో మొత్తం 3,26,788 ఎకరాలు సాగులో ఉండగా అందులో 1,69,560 ఎకరాలు వ్యవసాయ సాగులో ఉంది. ఉద్యానవన పంటల సాగు 1,45,335 ఎకరాలు, పట్టు పరిశ్రమ సాగు 11,892 ఎకరాల్లో ఉంది. జిల్లా వ్యాప్తంగా 1,57,575 మంది రైతులు ఉండగా జిల్లాలో 502 రైతుసేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. స్కిల్ అప్ చిత్తూరు ముఖ్య ఉద్దేశ్యం రైతులకు ఆధునిక డిజిటల్ నైపుణ్యాన్ని అందించడం. తద్వారా రైతులే స్వయంగా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే సామర్థ్యాన్ని పెంచడం, 'బడ్డీ ఫార్మర్ సిస్టమ్' ద్వారా సహచర రైతులకు ఈ అంశంపై అవగాహన పెంచడం జరుగుతుంది.

స్మార్ట్ ఫోన్ వాడకంపై రైతులకు శిక్షణ

స్మార్ట్ ఫోన్‌ను ఎలా ఉపయోగించాలి, యూపీఐ యాప్‌ల ద్వారా డబ్బులు పంపడం, అందుకోవటం, మార్కెట్ ధరలు, వాతావరణం, పంటల వివరాలు వంటి సమాచారం అందించే వ్యవసాయ యాప్‌ల వాడకం, యూట్యూబ్‌ను వ్యవసాయం సంబంధిత విషయాలు తెలుసుకోవటానికి ఉపయోగించడం, ప్రభుత్వ విధానాల గురించి పూర్తి సమాచారం పొందడం వంటి విషయాలపై పూర్తి పరిజ్ఞానాన్ని రైతులకు అందించారు. సాంకేతికత వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టిన రోజు నుంచి ఆన్లైన్లో విత్తనాలు కొనడం, డ్రోన్ సహాయంతో పొలమంతా ఎరువులు వేయడం వరకు అనేక రకాల మార్పులను ప్రస్తుతం చూస్తున్నాం. వ్యవసాయం కోసం మొబైల్ యాప్‌లో అనేక రకాల ఫీచర్లు ఉన్నాయి. వాటిలో ఒకటి ఇ–షాపింగ్.

ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంది..

- కె.తులసయ్య, రైతు, బూరగమంద పల్లి, సదుం

రైతు నైపుణ్య శిక్షణా కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇప్పటి వరకు సాగు చేసిన పంటను దళారుల ద్వారా అమ్మడం జరిగింది. దాని వలన తగిన మద్దతు ధర రావడం లేదు. ఈ శిక్షణలో మాకు పంటను నేరుగా కొనుగోలుదారులకు అమ్మడం, తద్వారా తగిన మద్దతు ధర పొందవచ్చుననే అంశాలు, సాగు పద్ధతులు, మార్కెట్ ధరలు వంటి వివరాల గురించి ఆన్లైన్‌లో అవగాహన కల్పించారు. నాకున్న వ్యవసాయ భూమిలో టమోటా, పుచ్చకాయల సాగు చేస్తున్నానని, నేను నేర్చుకున్న విషయాలను నాతోటి రైతులకు నేర్పుతాను.

కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మె న్యాయమైందని వెంటనే వారి సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద వారి చేస్తున్న సమ్మెకు సిఐటియు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ నుండి పీహెచ్‌డీ వరకు ఉన్నత విద్య చదివినప్పటికీ వారు చేస్తున్న ఉద్యోగానికి భద్రత లేకపోవడం దారుణమన్నారు. ఒక నిర్దిష్టమైన పని లేకుండా రకరకాల పనులు చేస్తూ పనిభారం పెంచారని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌డబ్ల్యూ ఉద్యోగులతో సమానంగా వేతనాల చెల్లించాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌సిలో ఓపి దగ్గర నుంచి అన్ని రకాల పనులు చేస్తూ గర్భిణీలకు టీబీ రోగులకు అన్ని రకాల వైద్య సలహాలు, సౌకర్యాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇలాంటి వారి కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్య రంగంలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలని నిరంతరం పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కూడా తీసివేయడం ఏమిటని ప్రశ్నించారు. గర్భిణీలు టీబి రోగులు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఎవరూ కూడా బాధపడకుండా వారికి సౌకర్యాలు అందించాలని అనుకుంటే వెంటనే కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేసి వారి సమ్మెను విరమింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని ప్రజాసంఘాలు వారి న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు మద్దతుగా ఉంటామని తెలిపారు.



కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు

అసెంబ్లీ పిటీషన్స్ కమిటీ మొదటి సమావేశం



కమిటీ మొదటి సమావేశంలో పాల్గొన్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పిటిషన్ కమిటీ మొదటి సమావేశం మంగళవారం విశాఖపట్నంలో జరిగింది. కమిటీ ఆన్ పిటిషన్స్ చైర్మన్, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ విధివిధానాలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ కమిటీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం కమిటీ పర్యటన షెడ్యూల్‌పై చర్చించారు. ఈసమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక (ఐటిఐ) శిక్షణ ప్రవేశం కొరకు మొదటి దశ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ అన్నారు. మంగళవారం ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐటిఐలో విద్యనభ్యసించడానికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మేనెల 24వ తేదీ సాయంత్రం లోపు విద్యార్హత మార్కులిస్టు, అలాగే ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, పాస్ ఫోర్ట్ సైజ్ ఫోటోలతో ఐటిఐ కళాశాల కార్యాలయంలో దర ఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ మెరిట్ ర్యాంకు ప్రకారం ఇంటర్వ్యూలు జరుగుతుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరై వారు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో చిత్తూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 916001 2999, 91609 60999 సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించిన ఆర్టీసీ ఉద్యోగులు

రెండో రోజూ నిరసన



బస్టాండ్ కూడలిలో నిరసన తెలియజేస్తున్న ఎన్ఎంయు సభ్యులు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. రెండవ రోజు నిరసన కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ఎస్.మునస్వామి, కార్యదర్శి ఈ.జయపాల్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై గత కొద్ది రోజులకు ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయడం, సమస్యలను తెలియజేస్తూ ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులకు వినతిపత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. అయినా వారి నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో రాష్ట్ర కమిటీ రిలే నిరసన దీక్షలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో కుప్పం డిపోలో గత రెండు రోజులుగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రిలే దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. చంద్రకళ, కుమారి, శేఖర్, రమణ, బాలకృష్ణ, వెంకటేషన్, పుష్పరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామివారి ఆలయంలో

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ప్రజాశక్తి- పలమనేరు: నియోజకవర్గంలోని కీలపట్లలోని శ్రీకోనేటిరాయ స్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మే 5 నుండి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా గర్భాలయం, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం. గజేంద్ర, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు విధ్వంసం

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం దేవళంపేట గ్రామం, పాలెం పంచాయతీ జూపల్లికి చెందిన రైతులు సుబ్బరత్న, చంద్రమోహన్‌లకు చెందిన మామిడి తోటలో మంగళవారం తెల్లవారుజామున ఒంటరి ఏనుగు దాడి చేసి మామిడి చెట్లను విరిచి, కాయలను నేలరాల్చి విధ్వంసం సృష్టించింది. మామిడి చెట్లను తొక్కి ధ్వంసం చేసింది. గత కొన్ని రోజులుగా పులిచెర్ల మండలంలో ఏనుగులు పంటలు చేతికందే సమయంలో నష్టం తెచ్చిపెడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుకుంటున్నారు.



కిశోరి వికాసం.. బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి- సోమల: కిశోరి బాలికలలో చైతన్యం తీసుకురావడానికి కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత తెలిపారు. మంగళవారం సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో కిశోరి వికాసం కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ సమాజంలో కిశోరి బాలికలు పలు రకాలుగా అన్యాయానికి గురవుతున్నారని, తెలిసి తెలియని వయసులో ప్రేమపేరుతో మోసపోతూ ఆపై సమాజంలో తలెత్తుకు తిరుగలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మరి కొందరు బాలికలు బాల్య వివాహాలకు బలైపోతున్నారని తెలిపారు. కిశోరి బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే రుతుక్రమం, పరిశుభ్రత, లింగ అసమానత బలం హక్కులు రక్షణ విద్య తదితర అంశాలను వేసవి సెలవులలో క్యాలెండర్‌గా సూచించి వారికి శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వీటిని బాలికలు సద్వినియం చేసుకోవాలని కోరారు. ఎంఈఓ శివరత్నమ్మ, ఏపీఎం శివ, సిహెచ్ఓ అమర్నాథ్, అంగన్వాడీలు పాల్గొన్నారు.



సోమలలో..

యాదమరి: యుక్త వయసులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం ఎంతో అవసరమని ఎంపీడీవో వేణు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన కిశోరి వికాసంపై లైన్ డిపార్ట్మెంట్‌లకు వేసవికాలం శిక్షణ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓలు రుక్మిణి, ప్రసాద్‌లు మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలంటే కిశోరి బాలల్లో వివాహంపై అవగాహన కల్పించాలని, వారు చెడు మార్గాన వెళ్లకుండా వారికి బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలను తెలియజేయాలని అప్పుడే బాల్య వివాహాలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. జిల్లా లీగల్‌సెల్ అధికారి వెంకటేష్, సిహెచ్ వరలక్ష్మీ నారాయణ, ఏపిఎం ఈశ్వరమ్మ, అంగన్వాడీ సూపర్వైజర్లు లలిత, సరళ, సెల్వికుమారి, హెల్త్ సూపర్వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, విజయ్ కుమారి, అంగన్వాడీ రాష్ట్ర ఉపాధ్యక్షులు షకీలా పాల్గొన్నారు.



శాంతిపురంలో..

బంగారుపాళ్యం: బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని సిడిపిఓ వాణి శ్రీదేవి అన్నారు. మండల కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జయశ్రీ, రెడ్డి కళ్యాణి ఆధ్వర్యంలో కిషోర్ బాలికల సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఓ రవి, సిఆర్‌పిలు సుశీల, ప్రేమలత పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శకుంతల ఆధ్వర్యంలో కిషోరి వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపియన్ కార్యక్రమం నిర్వహించారు. విద్య, వైద్య, డిఆర్‌డిఏ శాఖల సమన్వయంతో అంగన్వాడీ కార్యకర్తలకు, మహిళా సంరక్షకులకు, ఎఎన్ఎమ్‌లు, ఆశాలకు బాలికలకు బాల్య వివాహాలు, పోక్సో చట్టం, వ్యక్తిగత శుభ్రత, సైబర్ నేరాలు, మొబైల్ వాడకం వంటి నేరాలపై గ్రామస్థాయిలో కిషోరి బాలికలకు అవగాహన కల్పించేలా శిక్షణ ఇచ్చారు.

శాంతిపురం: కిశోరి వికాస వేసవి శిబిరాన్ని విజయవంతం చేయాలని శాంతిపురం సీడీపీఓ కల్పన తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ మే నెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు క్యాంపు నిర్వహించాలని సూచించారు. అమరజ్యోతి, ఎంపీడీవో ఏపిఆర్.కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుగుణ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శశికుమార్ పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని స్త్రీ శక్తిభవన్‌లో కిశోరి వికాసం మండలస్థాయి వర్క్‌షాప్ కార్యాక్రమం ఐసిడిఎస్ సిడిపిఓ ఎం.చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నిర్మూలన, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, లింగ వివక్ష వంటి వాపై సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు సుజాత, జయంతి, మెడికల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.



గుడిపల్లిలో..

కార్వేటినగరం: సైబర్ నేరాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ సీడీపీఓ పద్మసునంద తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్వాడీ, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వీవో లీడర్లకు కిశోరి వికాసం స్పెషల్ సమ్మర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ బాలికలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాలు, పోక్సో చట్టం వంటి వాటిపై అవగాహన కల్పించి చిన్నారులకు అప్రమత్తం చేయాలన్నారు. ఎంఈవో 2 మనోజ్ కుమార్, ఐసిడిఎస్ పర్యవేక్షకులు శామిని, ఇందిరా పాల్గొన్నారు.



కార్వేటినగరంలో..

రామకుప్పం: కిశోరి వికాస వేసవి శిబిరాన్ని విజయవంతం చేయాలని శాంతిపురం సీడీపీఓ కల్పన తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండలస్థాయిలో వర్క్‌షాపు నిర్వహించారు. కిశోరి బాలికలు సమ్మర్ క్యాంపు ద్వారా సాధికారత సాధించాలని ఆకాక్షించారు. అమరజ్యోతి, ఏపీఎం శ్రీనివాస్ మూర్తి, ఎంపీడీవో మురళీధర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మావతి, వెంకటేశ్వరి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శశికుమార్ పాల్గొన్నారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఎంపీడీవో రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు రమాదేవి, విజయలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు. అలాగే రొంపిచర్ల మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన కిశోరి బాలికల సంరక్షణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ ఎన్.ఇందిర, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దినేష్, సూపర్వైజర్ శిరీష పాల్గొన్నారు.

క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఐటీ రంగం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భారత ఆర్థిక వ్యవస్థకు ఊతనిచ్చిన ఐటీ రంగం ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నార్థకంగా మారిన ఐటీ రంగం స్థితిగతులపై చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ మంగళవారం ఢిల్లీ నుంచి స్పందించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం అధిరోహణ ఇంజిన్ ఐటీ రంగమన్నారు. ప్రస్తుతం దేశ ఐటి పరిశ్రమ ఇప్పుడు అపూర్వమైన అంతరాయాన్ని ఎదుర్కొంటున్న క్లిష్టమైన దేశమన్నారు. కుంచించుకుపోతున్న క్లయింట్ బడ్జెట్లను ఎదుర్కోంటుందని చెప్పారు. ఆటోమేషన్ వేగవంతం కావడం, భౌగోళిక రాజకీయ హెడ్‌విండ్‌లను తీవ్రతరం చేయడం, ఈ రంగం జెయింట్స్ ఇన్ఫోసిస్, టిసి, విప్రో జాగ్రత్త సంకేతాలను జారీ చేయడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధ్వర్యంలో సుంకాల లక్ష్యంతో సహా రక్షణాత్మక విధానాల పునరుత్థానం ద్వైపాక్షిక వ్యాపార సంబంధాలను మరింత దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయుడు ఈ డొమైన్, రిస్క్ వాడుకలో ఉన్న బలమైన దావాను అమలు చేయాలని సూచించారు. అప్పుడే భారత దేశ ఐటీ రంగం ప్రపంచ నాయకుడిగా తన స్థానాన్ని తిరిగి పొందుతుందని ఎంపీ అభిప్రాయ వ్యక్తం చేశారు.

బాబురెడ్డికి పరామర్శ




ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: జిల్లా వైసిపి సీనియర్ నాయకులు వేల్కూరు బాబురెడ్డిని మంగళవారం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. కంటి శస్త్రచికిత్స చేసుకొని వేల్కూరులో ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న బాబురెడ్డిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వైసీపీ అధ్యక్షులు వెంకటరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, గుణశేఖర్ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, మోహన్ ఉన్నారు.

రథంపై ఊరేగిన శివపార్వతులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని స్వయంబేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శివపార్వతులు రథంపై పురవీధులలో ఊరేగారు. ఉదయం 10 గంటలకు పుష్పాలతో రథాన్ని అలంకరించి శివపార్వతుల విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి అనంతరం 12 గంటల ప్రాంతంలో మడుగు తేరును భక్తులు లాగారు. ఆపై మూడు గంటల నుండి పురవీధులలో స్వామివారు సతీసమేతంగా ఊరేగగా భక్తులు కర్పూర హారతులను అందజేశారు.

పంచాయతీలో వీధిలైట్లు ఏర్పాట్లు



ప్రజాశక్తి- గంగవరం: మండల కేంద్రమైన గంగవరం పంచాయతీలోని 11 గ్రామాలలో మంగళవారం నూతన వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ చంద్రమ్మ తెలిపారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో పంచాయతీలో వీధి లైట్లు లేక అవస్థలు పడుతున్నామని ప్రజలు ఫిర్యాదు చేయగా స్పందించిన సర్పంచ్ అన్ని గ్రామాలలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాలలో అక్కడక్కడ వీధిలైట్లు మరమ్మతు కావడంతో వాటిని మాత్రమే వేయలేదని, మంగళవారం వాటన్నింటికీ మరమ్మతులు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -రామకుప్పం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలను రామకుప్పం టిడిపి నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్ సర్కిల్లో పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, ఆంజనేయ రెడ్డి,చిన్ని కృష్ణ, సీతాపతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు శిక్షణా తరగతులు

ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం


మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు టైలరింగ్ శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ తెలిపారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమం ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు చేతివృత్తులను ప్రారంభిస్తున్నామని మొదటి దశగా టైలరింగ్ శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం మండలంలోని 239 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో 109 మందికి మొదటి విడత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. శిక్షణ తరగతులు పూర్తయిన వారికి కావలసిన కుట్టుమిషన్లను కొనుగోలు చేసేందుకు ఆర్థిక సహాయం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వరరావు, సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు, మాజీ సర్పంచ్ కోదండ యాదవ్, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ధరణి ప్రసాద్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, రాజేంద్ర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

జీవన ప్రమాణాలకు అవరోధం కలిగిస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి- యాదమరి: పేదల జీవన ప్రమాణాలకు అవరోధం కలిగించే ఎలాంటి వారికైనా చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ పార్థసారధి పేర్కొన్నారు. మంగళవారం జంగాలపల్లి కుచంపల్లి ఎస్సీ కాలనీలో రెవెన్యూ, పోలీసు, అభివృద్ధి శాఖల అధికారుల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి రాజ్యాంగ వారి జీవన ప్రమాణాలకు భంగం వాటిల్లకుండా జీవించేందుకు పౌర హక్కులు కల్పించిందని అన్నారు. గ్రామాల్లో కులమతాలు భేదాలు లేకుండా అందరూ సమానమే అని, అన్ని వర్గాల ప్రజలు అందరూ సోదరభావంతో మెలగాలని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. ఎవరు, ఎవరిని కించపరచకుండా సత్ప్రవర్తనతో అందరూ నడుచుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీల గ్రామాల్లో భూముల దారి ఆక్రమణలు వారి కుటుంబాల జీవన ప్రమాణానికి ఆటంకం కల్పిస్తే అలాంటి వారి సంబంధించి తమకు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. వారి జీవన ప్రమాణాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసు రెవెన్యూ శాఖల సమన్వయంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామంలోని వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఎంపీడీవో వేణు, ఏపీవో సంధ్యారాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఎస్సీ సంఘం నాయకులు మురుగేష్, రవి, జార్జ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ పార్థసారధి

పల్లె దారులను పట్టించుకోరా..?

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
నడవలేకపోతున్నామంటున్న గ్రామస్తులు
కంకర తేలిన రోడ్లు



ప్రజాశక్తి- గంగవరం: గ్రామాలకు వెళ్లే దారులన్నీ గుంతలమయంగా కంకర తేలి అస్తవ్యస్తంగా మారాయి. గత కొన్నేళ్లుగా పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చే రోడ్లు పాడై వాహనదారులు, గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పలమనేరు నుంచి అప్పినపల్లికి సుమారు 18 కిలోమీటర్లు. ఈ దారిలో మూడు చెరువులు కూడా ఉన్నాయి, ఇరుకైన చెరువు కట్టపై వెళ్లేటప్పుడు ఎదురుగా వస్తున్న వాహనం కట్ట దాటే వరకు అతలివైపు ఉన్న వాహనాలు ఆగి ఎదురు చూడాల్సిందే.. దీనికి తోడు పలమనేరు నుంచి శంకరయ్య పేటకు 15 కిలో మీటర్లు రహదారి ఉంది ఈ దారి మొత్తం కంకర తేలి రాకపోకలకు నరకయాతనగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. అలాగే చెన్నై -బెంగళూరు రహదారి నుంచి కీలపల్లి మీదుగా బాలేపల్లి నుంచి పుంగనూరుకు వెళ్లే సుమారు ఆరు కిలోమీటర్లు దారి గుంతలమయంగా మారి మరమ్మతులకు నోచుకోక అలాగే నిలిచిపోయింది. ఇదే జాతీయ రహదారి నుండి ధనరాజుపల్లి నుండి ఉళ్లుగుంట గ్రామానికి నాలుగు కిలోమీటర్లు మట్టితోలి వదలడంతో వర్షాకాలంలో బురదమయమైన దారిలో ప్రయాణించలేక ప్రజలు గ్రామానికి పరిమితమవుతున్నారు. జాతీయ రహదారి గన్రాజుపల్లి నుండి గుండిగల్లు మీదుగా 10 కిలోమీటర్లు పుంగనూరు రహదారిలోకి కలిసే గ్రామీణ దారి పరిస్థితి కూడా ఇదే. దీనికి తోడు రహదారి మలుపులలో పూర్తిగా ముల్లకంపలు పెరిగిపోవడంతో అసలే ఇరుకుగా ఉన్న గ్రామీణ రోడ్లు ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకపోవడంతో అనేకసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలానే ఉన్నాయి. పలమనేరు శంకరయ్య పేట రహదారి నుండి తమ్మిరెడ్లపల్లి మీదుగా నాలుగవ జాతీయ రహదారిలోకి కలిసే దారి ఐదు కిలోమీటర్లు ఇందులో సగం మాత్రమే పనులు పూర్తి చేసి మిగతా పనులు అలానే వదిలేయడంతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతూనే ప్రయాణిస్తున్నారు. ఇక పత్తికొండ నుండి నిడిగుంట దారి సైతం పూర్తిగా గుంతలమయంగా తయారైంది. ఈ రోడ్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల రైతులు పండించిన పంటలను మార్కెట్‌కి తరలించాలంటే ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని స్థితిలో రోడ్లు ఉన్నాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రహదారులకు కోట్ల రూపాయలు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినా కొన్నిచోట్ల మాత్రం గుంతలను పూడ్చి వదిలేయంతో కొద్దిరోజులకే యధాప్రకారం గుంతలు పడిపోయాయి. ఇకనైనా సంబంధిత అధికారులు చొరచూపి రోడ్లు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశ్రమల స్థాపనకు చర్యలు: కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాది అవకాశాల పెంపులో భాగంగా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమలశాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం వారికి అవసరమైన నైపుణ్యాల పెంపునకు చర్యలు చేపట్టడంలో భాగంగా జిల్లాలో గల పరిశ్రమలకు అవసరమైన శిక్షణ కలిగిన సిబ్బంది నిమిత్తం సంబందిత పరిశ్రమలతో సమన్వయం చేసుకుని శిక్షణ ఇప్పించడంతో పాటు సర్టిఫికెట్ అందజేయడం సంబందిత అంశాలను జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జిల్లా పరిశ్రమ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని ఉపాధి అవకాశాల పెంపుతో పాటు పరిశ్రమలకు అవసరమైన సిబ్బందికి కొరత ఉండదని ఈ దిశగా పనిచేయాలన్నారు. పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ప్రోత్సాహకాలు పొందిన పరిశ్రమల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ. 557 కోట్లతో 61,619 మందికి ఉపాధి కల్పించేలా 15,371 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. సింగల్ డెస్క్ పోర్టల్ కింద 5 మార్చి నుండి 26 ఏప్రిల్ వరకు 234 దరఖాస్తులు స్వీకరించగా 222 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయడమైనదని తెలిపారు. పిఎం విశ్వకర్మ యోజన కింద శిక్షణ పొందిన వారి నుండి అందిన అప్లికేషన్‌లో 385 మందికి రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ గ్రామ,వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా చేస్తున్నామని అన్నారు. జీఎం ఇండస్ట్రీస్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, డిపిఒ సుధాకర్ రావు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మురళి కృష్ణ, మధుసూదన్ రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ ఈ ఇస్మాయిల్, జిల్లా పండ్ల సమాఖ్య సభ్యులు బాబీ, ఎస్ఎస్‌సిపిఐ ఛైర్మన్ డేవిడ్ బ్రెయినాడ్ పాల్గొన్నారు.

మీ రక్షణ కోసం హెల్మెట్ వాడండి..

టూ టౌన్ సిఐ నెట్టి కంటయ్య


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనదారులకు ఫైన్ విధించడం తమ ఉద్దేశం కాదని మీ ప్రాణ రక్షణ కోసం విధిగా హెల్మెట్ ధరించాలని చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నెట్టి కంటయ్య తెలిపారు. మంగళవారం రాత్రి టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువగా తలకు గాయాలవుతాయని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు తలకు రక్షణగా ఉంటుందని ప్రమాదం నుండి బయటపడవచ్చు అని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాలని, సీటు బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం హెల్మెట్ పెట్టుకుంటామని ద్విచక్ర వాహనదారుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

బందోబస్తును పరిశీలించిన డీఎస్పీ



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులో బుధవారం రాత్రి జరిగే గంగ చాటు కార్యక్రమ ఏర్పాట్లను పలమనేరు డిఎస్పి డేగల ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంగ చాటు కార్యక్రమానికి పక్కాగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంగమ్మ, మారెమ్మ గుడి, గుండుబాయి వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సిఐ నరసింహారాజు, ఎస్సై స్వర్ణతేజ, గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

లాప్రోస్కోపీ శస్త్ర చికిత్సపై సదస్సు



ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ చేన్నన్న చిదంబరరావు ఆధ్వర్యంలో లాప్రోస్కోపీ శస్త్ర చికిత్స నైపుణ్య అభివృద్ధి అనే అంశంపై ఒక రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ముక్తీశ్వరయ్య, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సునీల్ కుమార్ విచ్చేశారు. ముందుగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్-ఎస్ఆర్ సుబ్బారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యల సమక్షంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వక్తలు ప్రసంగిస్తూ ప్రాథమిక దశలో హెర్నియా చికిత్స నుండి ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సల వరకు విస్తృత అంశాలపై సందేశాన్ని అందజేశారు. శస్త్ర చికిత్సలందు తీసుకోవలసిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు తెలియజేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి క్విజ్ పోటీలను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

పూజకు హాజరైన తంబళ్లపల్లె ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల - కల్లూరు మార్గంలో నూతనంగా నిర్మించిన శ్రీఎల్లమ్మ తల్లి ఆలయంలో మంగళవారం పూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరయ్యారు. ఆలయంలో ఉదయం అభిషేకాలు, హోమం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అమ్మవారి దర్శనంతో పాటు అన్నదానం నిర్వహించారు.